
# సాక్షి
## అనకాపల్లి

గురువారం । 21 । డిసెంబర్ । 2023



**కూలిన తాచేరు వంతెన**

తాచేరు వంతెన కూలడంతో జీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. 10లో



**ప్రతి విద్యార్థికి అవగాహన**

విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంలో అవగాహన కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. 10లో



**ఘనంగా తిరువీధి**

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు.

# సీటీ స్కాన్‌తో అధునాతన వైద్యం

- ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రారంభం
- పేదల వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట
- అందుకు అనుగుణంగా విప్లవాత్మక మార్పులు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**అనకాపల్లి:** పేదల వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని, అందుకు అనుగుణంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, అమలు చేస్తున్నారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదానీ కంపెనీ సహకారంతో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీస్కాన్ మిషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలు ఉండే ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచి బడుగు, బలహీనవర్గాలకు కార్పొరేట్ వైద్యం అందిస్తోంది తమ ప్రభుత్వమేనని చెప్పారు. వారంరోజుల్లో సీటీస్కాన్ మిషన్ పూర్తి స్థాయిలో రోగులకు అందుబాటులోకి వస్తుందన్నారు. గత ప్రభుత్వం ఈ ఆస్పత్రిలో వ్యాపారం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో రోగులకు పూర్తిస్థాయిలో ఉచితంగా వైద్యసేవలందిస్తున్నట్టు తెలిపారు. సుమారు 16 మండలాలకు చెందిన రోగులు నిత్యం ఇక్కడకు వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు సీటీస్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సీటీస్కాన్ నిర్వహణకు వైద్యులతోపాటు సిబ్బందిని నియమిస్తామన్నారు. రూ.12 కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రికి ఎదురుగా 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ వార్డును ఏర్పాటు చేస్తున్నామని, ప్రాథమిక పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా వైద్యులు, నర్సుల సంఖ్యను గణనీయంగా పెంచినట్టు చెప్పారు. గతంలో ఈ ఆస్పత్రిలో 500 నుంచి 600 వరకు ఓపీ నమోదైతే, ప్రస్తుతం 800 నుంచి 1200 వరకు ఓపీ నమోదవుతోందన్నారు. ఇన్‌పేషెంట్ల కోసం 200 పడకలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్టు చెప్పారు. పేదలకు వైద్యం అందించే విషయంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలి పారు. అనారోగ్యం బారిన పడితే పూర్తిస్థాయిలో రోగి కోలుకునే విధంగా ప్రభుత్వం వైద్యఖర్చులు భరిస్తుందని చెప్పారు. అంతకుముందు వైద్యాలయంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాస్, ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహరావు, వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మునూరు శ్రీను, ఎ.వి.రత్నకుమారి, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జాజుల రమేష్ పాల్గొన్నారు.

### జనవరి 5న ఓటర్ల జాబితా
# తుది ప్రచురణ



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన ఓటర్ల జాబితా తుది ప్రచురణ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుది జాబితా విచారణ తరువాత మళ్లీ దరఖాస్తులు తీసుకోనున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు జరిగిన చేర్పులు, మార్పులు తొలగింపులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు.

వివిధ మార్పులు కోరుతూ వచ్చిన 1,03,455 దరఖాస్తుల్లో 96,002 పరిష్కరించినట్టు చెప్పారు. ఒకే ఇంటిలో పదికి మించి ఓటర్లు ఉన్న 1,822 ఇళ్లకు సంబంధించి 27,206 ఓటర్లలో 16,056 మంది నిజమైన ఓటర్లుగా గుర్తించామన్నారు. 11,114 మంది పేర్లు ఈఆర్‌వో.నెట్‌లో సవరించినట్టు చెప్పారు. కేవలం 36 మంది ఓటర్లను మాత్రమే గుర్తించవలసి ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల భాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఎస్ఏ తులసీరామ్ పాల్గొన్నారు.

### సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
# నేడు చింతపల్లి రాక



- ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగ సభ

**సాక్షి, పాడేరు:** గిరిజన హృదయ విజేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం చింతపల్లిలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజున చింతపల్లి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు గిరిజనం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. చింతపల్లికి సమీపంలోని చౌడుపల్లి వద్ద రోడ్లు భవనాలశాఖ అధికారులు హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. సీఎం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆ శాఖ ఉన్నతాధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సభ జరిగే డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు పది వేల మందికి సరిపడేలా కుర్చీలతో సభావేదికను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చింతపల్లి వస్తున్నందున అధికారులు బుధవారం ఉదయం ఏరియల్ సర్వే నిర్వహించారు.

**పర్యటన ఇలా..**

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో చౌడుపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో చింతపల్లి వెళతారు. ముందుగా అదే ప్రాంతంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. విద్యార్థులతో మాట్లాడతారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు.

అక్కడ నుంచి డిగ్రీ కళాశాల మైదానంలోని సభకు సీఎం వెళతారు. సభ ముగిసిన అనంతరం ఆయన చౌడుపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ కొద్దిసేపు వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడతారు. అనంతరం హెలికాప్టర్‌లో సీఎం విశాఖ బయలుదేరుతారు.

**భారీగా పోలీసు బందోబస్తు**

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో చింతపల్లితో పాటు సమీప ప్రాంతాలలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో గత రెండు రోజుల నుంచి పోలీసు బలగాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. ఎస్పీ తుహిన్ సిన్హాతో పాటు చింతపల్లి, పాడేరు ఏఎస్పీలు పోలీసు భద్రత చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.





# విదేశీ విద్యా దీవెనతో
## పేద విద్యార్థులకు ఉన్నత చదువులు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- ఇద్దరికి రూ.19,79, 068 ఆర్థిక సాయం
- సివిల్స్‌కు సిద్ధమవుతున్న వారికి రూ.లక్ష చొప్పున అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు పేద విద్యార్థులకు అవకాశం కలుగుతోందని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి తెలిపారు. తాడేపల్లిలో సీఎం జగన్ చేతుల మీదుగా మూడవ విడత జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ప్రారంభకార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయంలో వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో గల టాప్ 50 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇతర కోర్సుల్లో విద్యను అభ్యసించే రాష్ట్ర విద్యార్థులకు శత శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నట్టు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమెరికాలోని కార్నర్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న జిల్లాకు చెందిన సుదీప (ఓబీసీ)కు రూ.13,78,666, కజకిస్తాన్‌లో అల్ ఫరాబీ నేషనల్ యూనివర్సిటీలో చదువుతున్న ఎస్సీ కులానికి చెందిన బొడ్డు దీన రాచెల్‌కు రూ.6,00,400 కలిపి మొత్తం రూ.19,79, 068 అందించినట్టు చెప్పారు. అదేవిధంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీకి సిద్ధమవుతున్న మొల్లి మధు ప్రతాప్, గన్నం రాజు సత్య శివరాం రాజవంశీ, కొరుప్రోలు సత్య సాయిరాజ్, అమలకంటి కృష్ణ వర్ధన్‌లకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఉపమాకలో ధనుర్మాస సేవల పునరుద్ధరణ

- అధికారులకు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆదేశం
- వైస్ ఎంపీపీ వినతిపై స్పందించిన చైర్మన్
- సేవల నిర్వహణకు తక్షణం రూ.1.20 లక్షలు విడుదల
- భక్తుల నుంచి హర్షాతిరేకాలు

10లో







### ఐఏఎస్ తల్లిదండ్రులకు ప్రవీణ్ ప్రకాష్ అభినందన



మౌర్య భరద్వాజ్ తల్లిదండ్రులను అభినందిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

**నర్సీపట్నం:** ముఖ్యమంత్రి కార్యక్రమానికి చింతపల్లి వెళుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బుధవారం నర్సీపట్నంలో కాసేపు ఆగారు. నర్సీపట్నానికి చెందిన మౌర్య భరద్వాజ్ ఐఏఎస్ సాధించి, ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. నర్సీపట్నంలో ఉంటున్న మౌర్య భరద్వాజ్ తల్లిదండ్రులు ఎం.ఎస్.ప్రసాద్, రాధకుమారిలను ప్రవీణ్ ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు.



# కూలిన తాచేరు వంతెన



విజయరామరాజుపేట వద్ద కూలిన తాచేరు వంతెన

- జీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద నిలిచిన రాకపోకలు
- కూలిన వంతెనను పరిశీలించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అధికారులు
- డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి ఆదేశం



కూలిన వంతెనను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



కూలిన వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డు పనులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన కూలిపోయింది. బుధవారం ఉదయం వంతెన కూలిపోగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరలేదు. అయితే చోడవరం, నర్సీపట్నం, పాడేరు, విశాఖపట్నం, అనకాపల్లి, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ రూటులో తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. ఎస్ఐ కుమారస్వామి వంతెనకు ఇరువైపులా భారీ కేడ్లు ఏర్పాటు చేసి, బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన 15 ఏళ్లుగా శిథిలావస్థకు చేరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరవాత బీఎన్ రోడ్డు విస్తరణకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రూ. 78 కోట్లు మంజూరు చేయించారు. తాచేరు వంతెన నిర్మాణానికి రూ. 5.5 కోట్లు కేటాయించారు. బుధవారం సంఘటన స్థలాన్ని నాయకులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వం విప్ వంతెన నిర్మాణంలో జాప్యంపై ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం డైవర్షన్ రోడ్డు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. శిథిలమైన వంతెనపై నుంచి 40 నుండి 60 టన్నుల బరువున్న గ్రానైటు లారీలు రాకపోకలు సాగించడంతో వంతెన కూలిపోయిందని స్థానికులు తెలిపారు. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, చోడవరం సీఐ శ్రీనివాసరావు కూలిన వంతెనను పరిశీలించారు. జెడ్పీటీసీ రాంబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహాలక్ష్మినాయుడు, సర్పంచ్ విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు గోవింద పాల్గొన్నారు.

వంతెన కూలిన ఐదు గంటల్లోనే ఆర్‌అండ్‌బీ అధికారులు డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు. కూలిన వంతెన పక్క నుంచి పొక్లెయిన్‌తో డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారు. రెండు రోజుల్లోనే డైవర్షన్ పనులు పూర్తి చేసి శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలు సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

## విద్యుత్ ఆదా చేసే బోర్లు, యంత్రాలపై రాయితీ



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : విద్యుత్‌ను పొదుపుగా వాడే చిట్కాలను గుర్తించి గ్రామీణ ప్రాంతంలో కూడా పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో ముగింపు సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యుత్ ఆదా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపు చేయడంలో గృహోపకరణాల వినియోగంలో గ్రామీణ గృహిణులకు అవగాహన కల్పించాలన్నారు. లఘు పరిశ్రమలు, బోర్లు, వ్యవసాయ పరికరాల ఉపయోగించే వినియోగదారుల వారీగా ఆయా యంత్రాలను తక్కువ విద్యుత్ ఖర్చు అయ్యేలా ఏ విధంగా వినియోగించాలో వివరించాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్రనాథ్ మాట్లాడుతూ విద్యుత్ ఆదా చేసే బోర్లు యంత్రాలపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందని తెలిపారు. సమావేశంలో విద్యుత్‌శాఖ సీజీఎం సింహాద్రి, పట్టణ విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్, డిఈ సతీష్ పాల్గొన్నారు.

## ఉపమాకలో ధనుర్మాస సేవల పునరుద్ధరణ

- అధికారులకు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆదేశం
- వైస్ ఎంపీపీ వినతిపై స్పందించిన చైర్మన్
- సేవల నిర్వహణకు తక్షణం రూ.1.20 లక్షలు విడుదల
- భక్తుల నుంచి హర్షాతిరేకాలు



తిరుపతిలో టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు

నక్కపల్లి : ఉపమాకలో టీటీడీ అధికారులు నిలిపివేసిన ధనుర్మాస సేవలను పునరుద్ధరించాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీఅధికారులను ఆదేశించారు. ఈమేరకు టీటీడీ అధికారులు తక్షణమే రూ.1.20 లక్షలు విడుదల చేస్తూ బుధవారం ఆగమేఘాల మీద ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాచీన పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతి ఏటా ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ధనుర్లగ్నం ప్రవేశం లగాయితూ నెలరోజుల పాటు ఇక్కడ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు పగలు, రాత్రి వివిధ వాహనాల్లో స్వామి వారికి తిరువీధి సేవలు నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం స్వామివారిని రంగనాథుని అలంకారంలో ఏడు వాహనాల్లో ఉంచి ఘనంతా తిరువీధి సేవలు నిర్వహిస్తారు. ఆగమశాస్త్రానుసారం 6వ శతాబ్దం నుంచి ఉపమాకలో స్వామివారి కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు జరిగేవి. ఈ ఏడాది 17వ తేదీ నుంచి ఉపమాక ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు పగలు, రాత్రి నిర్వహించే వాహన సేవలతోపాటు కొన్ని ఆర్జిత సేవలను టీటీడీ అధికారులు రద్దు చేశారు. కేవలం కొండపై మూలవిరాట్ సన్నిధిలోను, కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తులు, గోదాదేవి సన్నిధిలో మాత్రమే నిత్యార్చనలు, పూజలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో భక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ సూచనల మేరకు నక్కపల్లి వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉపమాక ఎంపీటీసీ సభ్యుడు కొల్నాటి బుజ్జి, వార్డు సభ్యులు జి.బంగారాజు, అల్లాడ కొండ, సత్తిబాబు బుధవారం తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని కలిసి ఉపమాక ఆలయంలో ధనుర్మాస సేవలు నిలిపివేసిన విషయాన్ని వివరించారు. సంప్రదాయంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆర్థిక పరమైన అంశాలతో ముడిపెట్టి రద్దు చేయడం భావ్యం కాదని విన్నవించారు. వెంటనే చైర్మన్ స్పందించి జేఈవోతో ఫోన్లో మాట్లాడారు. తక్షణమే సేవలు పునరుద్ధరించడంతోపాటు, వాటి నిర్వహణకయ్యే నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో విజయవాడలోని జేఈవో కార్యాలయ సిబ్బంది ఉపమాకలో సేవలను పునరుద్ధరిస్తూ వాటి నిర్వహణ కోసం రూ.1.20 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి యథావిధిగా సేవలు నిర్వహిస్తామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ చెప్పారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



## ప్రతి విద్యార్థికి ట్యాబ్ వినియోగంలో అవగాహన

- పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేలా శ్రద్ధ చూపాలి
- ప్రపంచస్థాయి బోధనా వీడియోలు చూపి మార్గనిర్దేశం చేయాలి
- ఉపాధ్యాయులకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సూచన



విద్యాశాఖ అధికారులకు ట్యాబ్‌ల వినియోగంపై సూచనలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

యలమంచిలి రూరల్: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడంతో ఉపాధ్యాయుల పాత్ర అయిపోదని, వాటిని వారు పూర్తిగా వినియోగించేలా చేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు. గురువారం సీఎం చింతపల్లి పర్యటనలో పాల్గొనేందుకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం రాత్రి యలమంచిలి వచ్చిన ప్రవీణ్ ప్రకాష్‌కు రైల్వే స్టేషన్‌లో విశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, పలువురు ప్రధానోపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కాసేపు ఆగిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్‌ల వినియోగంపై, పర్యవేక్షణపై విద్యాశాఖ అధికారులకు సూచనలిచ్చారు. ప్రతి విద్యార్థి ట్యాబ్‌ను పూర్తిగా వినియోగించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. 30 నిముషాల్లో చెప్పే విషయం 5 నిముషాల్లోనే ఒక వీడియో ద్వారా విద్యార్థులకు అర్థమవుతుందన్నారు. ట్యాబుల్లో విద్యార్థులకు కావాల్సిన పాఠాన్ని తరగతి గదిలో చూపిస్తే సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత మళ్లీ అదే పాఠాన్ని విద్యార్థి మరోసారి చూసుకునేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి బోధనా వీడియోలు చూపించి, మార్గనిర్దేశం చేయాలన్నారు. ఎంఈవోలు మీనాక్షి, అరుణ్‌కుమార్, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, జిల్లా రిసోర్స్ పర్సన్ సుసర్ల సూర్యప్రకాష్, హెచ్‌ఎంలు ఎ.వి.హెచ్.శాస్త్రి, సాయిబాబా, కొణతాల విశ్వేశ్వరరావు (విస్సు) స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## 'ఆడుదాం.. ఆంధ్ర' విజయవంతం చేయాలి



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

- ఈనెల 26 నుంచి ప్రారంభం

తుమ్మపాల : ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు నిర్వహించే ×ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు విజయవంతం చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ విజయవాడ నుంచి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడీ, ఖోఖో వంటి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో అంబాసిడర్లను ఎంపిక చేయడం జరిగిందని, ఆయా క్రీడలకు సంబంధించిన కిట్లను కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.



## ఏయూ హాకీ జట్టు కోచ్‌గా దుర్గారావు





హాకీ కోచ్ దుర్గారావు ఏయూ హాకీ జట్టుతో కోచ్ దుర్గారావు

యలమంచిలి : ఆంధ్రా యూనివర్సిటీ హాకీ జట్టుకు కోచ్‌గా యలమంచిలి పట్టణానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొతారు దుర్గారావును ఏయూ స్పోర్ట్సు బోర్డు ఎంపిక చేసినట్టు ఆయన బుధవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి 30 వరకు తిరుచినాపల్లిలో ఉన్న భారతి దాసన్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ అంతర యూనివర్సిటీల హాకీ పోటీల్లో పాల్గొనే ఏయూ హాకీ జట్టుగా కోచ్‌గా దుర్గారావు నియమితులైనట్టు తెలిపారు. ఆయనకు యలమంచిలి హాకీ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## గ్రంథాలయ నిర్వహణ భేష్



లైబ్రరీ సిబ్బందితో పౌర గ్రంథాలయ రాష్ట్ర సంచాలకుడు ప్రసన్నకుమార్

నర్సీపట్నం: మండల కేంద్రం నర్సీపట్నంలో శాఖ గ్రంథాలయం నిర్వహణ బాగుందని పౌర గ్రంథాలయ రాష్ట్ర సంచాలకులు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ గ్రంథాలయాన్ని సందర్శించి, అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. పరిశుభ్రత, అంశాల వారీగా పుస్తకాలను అందుబాటులో ఉంచడంలో, అన్ని వసతులు సమకూర్చడంలో గ్రంథాలయ అధికారిణి దమయంతి చక్కని సేవలు అందిస్తున్నారని అభినందించారు. అవసరమైన అభివృద్ధి పనులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఎంఈవోలు సీహెచ్.తలుపులు, జేవి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మేడపై నుంచి పడి కాంట్రాక్టు కార్మికురాలు మృతి



కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

రాంబిల్లి: సెజ్‌లో ఎసెన్షియల్ పరిశ్రమ వద్ద బుధవారం వాటరింగ్ చేస్తూ మేడపై నుంచి కిందకు జారిపడి అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం పంచాయతీ మోటూరుపాలేనికి చెందిన కాంట్రాక్టు కార్మికురాలు కక్కల ఈశ్వరి(32) మృతి చెందింది. కాగా ఈ ఘటనలో మృతురాలి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆధ్వర్యంలో కంపెనీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దీనబంధు తెలిపారు.

## డీఆర్‌ఎం కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం

తాటిచెట్లపాలెం : దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుతో డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. వియత్నాం ప్రావిన్షియల్ నేషనల్ అసెంబ్లీకి చెందిన 19 మంది సభ్యులు ఏపీఈడీబీ సభ్యులతో కలిసి పాల్గొని, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు సభ్యుల నుంచి స్వీకరించారు. రాబోయే రోజుల్లో పరస్పర అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇరు ప్రాంతాలకూ లబ్ధి, సహకారం, సాంకేతికత బదిలీపై ప్రధానంగా చర్చించారు.

అంతర్జాతీయ సంబంధాల మెరుగుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని ఇరుపక్షాల ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఏపీఈడీబీ) తరఫున కె.ప్రకాష్‌బాబు, ప్రావిన్షియల్ పార్టీ కమిటీ సెక్రటరీ ఎన్గో థన్హ్ డాన్హ్, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ పీఆర్ నాయుడు, రైల్వే కన్‌స్ట్రక్షన్ చీఫ్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, వియత్నాం ప్రతినిధులు, వాల్తేర్ డివిజన్ ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తుగా సీఎం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కశింకోటలో ముందస్తుగానే బుధవారం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమం అనంతరం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పెద్ద కేక్ కట్ చేసి సీఎం పుట్టిన రోజు వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ సంస్థ అధ్యక్షుడు దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి చురుగ్గా ఏర్పాట్లు

- సింహగిరికి 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా
- దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



సింహగిరిపై ట్రస్ట్‌బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని సింహగిరిపై ఈ నెల 23న వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి ఉత్సవం నిర్వహణపై ఇప్పటికే అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ఆయా శాఖల అధికారులతో ఫీల్డు విజిట్ కూడా చేశామని తెలిపారు. 23న తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వైదిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 4.45 గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనం ధర్మకర్తలు, ట్రస్టుబోర్డు సభ్యులు, వీఐపీలకు కల్పిస్తామని తెలిపారు. తదుపరి స్వామిని ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద వేంజేపచేసి 5.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం 11.30 గంటల వరకు ఉత్తరద్వార దర్శనం లభిస్తుందన్నారు. తదుపరి స్వామికి సింహగిరి మాడవీధిల్లో తిరువీధి నిర్వహిస్తామని తెలిపారు. స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్టు తెలిపారు. ఉచిత, రూ.100, రూ.300 టిక్కెట్లతోపాటు రూ.500 ఉత్తర ద్వార దర్శనం టిక్కెట్లు కూడా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కంట్రోల్ రూమ్, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం ఎవరికీ అంతరాలయ దర్శనం ఉండదని తెలిపారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే స్వామి వారి మూలవిరాట్ కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దర్శనానంతరం బయటకి వచ్చే భక్తులకు దక్షిణ రాజగోపురం వద్ద ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. అన్నప్రసాద భవనంలో పొంగలి అందిస్తామని తెలిపారు. క్యూలోని భక్తులకు వలంటీర్ల ద్వారా తాగునీరు అందిస్తామని, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయనతోపాటు ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, సూపరింటెండెంట్ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ అప్పన్న చిరస్మరణీయుడు

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



గుడివాడ అప్పన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: పెందుర్తి ప్రథమ శాసనసభ్యుడిగా గుడివాడ అప్పన్న అందించిన సేవలు ఎనలేనివని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గుడివాడ అప్పన్నకాలనీ వద్ద గల గ్లోబెక్స్ థియేటర్ పక్కన అప్పన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పల రామ్మూర్తి, అప్పన్న మనవడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లతో కలిసి బుధవారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడి నిరుపేదలకు అప్పన్న ఇళ్ల పట్టాలు అందజేయడంతో.. గుడివాడ అప్పన్నకాలనీగా చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అనంతరం వారు పేద, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్, గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు), కార్పొరేటర్లు గుడివాడ అనూష, కార్పొరేటర్, బొడ్డు నర్సింహ పాత్రుడు, రాజాన రామారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు ఉరుకూటి అప్పారావు, గుర్రం రాజేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటీ సురేష్, గుడివాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

**అనకాపల్లి:** మండలంలోని కోడూరు సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**82వ వార్డు సచివాలయం పరిధిలో..**

స్థానిక ఏఎంసీకాలనీ 82వ వార్డు 4వ సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

### ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు పావని


పావని

**అనకాపల్లి:** స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి.పావని ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నై సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులకు నిర్వహించిన టీం సెలక్షన్స్‌లో పావని ఎంపికైనట్లు చెప్పారు.

### 'ఆరోగ్యశ్రీ' కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెంలో ఆరోగ్యశ్రీ పథకం నూతన కార్డుల పంపిణీ బుధవారం చేపట్టారు. ఎంపీపీ కలగా లక్ష్మి వీటిని లబ్ధిదారులకు అందజేశారు. రూ.25 లక్షల పరిమితి వరకు ఉచితంగా వైద్య సేవలు పొందడానికి ఉపయోగపడే ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పార్టీ నాయకుడు లగిశెట్టి గణేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### భోగలింగేశ్వరాలయ అభివృద్ధికి చర్యలు

**అనకాపల్లి :** గవరపాలెం శ్రీభోగలింగేశ్వర స్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ఆలయ అభివృద్ధికి దాతలు తమ వంతు సహాయం చేయాలని ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. దేవాలయం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి 8వ తేదీన మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ఆవరణలో కల్యాణ మండపం, ఫ్లోరింగ్, ఇతర పనులకు సుమారు రూ.25 నుంచి 30 లక్షలు ఖర్చు అవుతుందని, భక్తుల నుంచి ఆర్థిక సహాయం కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. విరాళాలు ఇచ్చే భక్తులు 9154088181 నంబరులో గాని, ఈవో ఆదినారాయణరెడ్డిని గానీ సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాసుపల్లి తాతలు, కొణతాల కృష్ణంరాజు, కొణతాల త్రినాథ్, అర్చకులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి పలువురి ఆర్థిక సాయం

**కశింకోట :** మండలంలోని కన్నూరుపాలెంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న రుత్తల ప్రభాకర్ కుమార్తె నాలుగేళ్ల లాస్యశ్రీ చికిత్స నిమిత్తం గ్రామ సర్పంచ్ సిరపరపు శివ రూ.5 వేలు, గ్రామ వలంటీర్లు రూ.5 వేలు, అరబుపాలెం గ్రామానికి చెందిన బొడ్డేడ నాగేశ్వరరావు తదితరులు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

### 23న వినియోగదారులకు అవగాహన సదస్సు

**అనకాపల్లి:** జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా ఈ నెల 23న స్థానిక గౌరీ గ్రంథాలయంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్, మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు సిహెచ్.వి.సూర్యభాస్కరం హాజరవుతారన్నారు.

### కనకమహాలక్ష్మి దర్శనానికి ఏర్పాట్లు

**కశింకోట:** కశింకోటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం ఎక్కువ సంఖ్యలో దర్శించనున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్ తెలిపారు.

# ఆహ్లాదకరంగా పార్కులు




**నాడు**

గత ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో అవి మందుబాబులకు అడ్డాగా మారేవి. పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో పాములు, కుక్కలు నిద్రించేవి. అటువంటి పార్కుల వైపు చూసేందుకు పట్టణ ప్రజలు అనాసక్తి చూపేవారు. దీంతో పట్టణంలో పార్కులు కరువయ్యాయి. నెలలో ఒక ఆదివారం కుటుంబ సమేతంగా విశాఖ నగరానికి పయనమయ్యే పరిస్థితులు కనిపించేవి.

**నేడు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా కేంద్రం కావడంతో పట్టణంలో రెండు పార్కులు అభివృద్ధికి నోచుకున్నాయి. అందంగా.. ఆహ్లాదకరంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు. గాంధీనగరం గాంధీ పార్కును జీవీఎంసీ రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి చేసింది. శారదానది ఒడ్డు గల శాంతి పార్కును రూ.59 లక్షలతో శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను జీవీఎంసీ సిబ్బంది తీసుకున్నారు.


గాంధీనగరం గాంధీ పార్కులో ఉట్టిపడుతున్న పచ్చదనం




**అనకాపల్లిటౌన్:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలో రెండు పార్కులకు మహర్దశ పట్టింది. గతంలో స్థానికంగా ఒక్క పార్కు అందుబాటులో లేకపోవడంతో సామాన్య ప్రజలు నెలలో ఒక ఆదివారం విశాఖ నగరానికి వెళ్లేవారు. గంటన్నర సమయాన్ని వృథా చేసుకోవడంతోపాటు ప్రయాణ ఖర్చులతో వ్యయప్రయాసలకు ఓర్చి చిన్నారులకు సంతోషాన్ని దగ్గర చేయాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం చిన్నారులతో పాటు పెద్దలకు పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ విషయంపై ఇటు ప్రజాప్రతినిధులు.. అటు అధికారులు దృష్టి సారిస్తున్నారు.

**గాంధీ పార్కు కళకళ**

గాంధీ నగరంలోని మహాత్మా గాంధీ ఉద్యానవనాన్ని జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో ఆధునికీకరించారు. పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటారు. సందర్శకులు సేదతీరేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. మొక్కల సంరక్షణకు రోజు సాయంత్రం వేళలో జీవీఎంసీ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. స్థానిక మహిళలందరూ సాయంత్రం సమయంలో పార్కులో చేరి రాత్రి 7 గంటల వరకు సరదాగా గడుపుతూ కనిపిస్తున్నారు. చిన్నారులు క్రికెట్, కబడ్డీ ఆటలాడుకుంటున్నారు. వృద్ధులు పార్కులో ఉన్న బెంచీలపై కూర్చొని సేద తీరుతూ దినపత్రికలు చదువుతూ కనిపిస్తున్నా రు. కొంతమంది పార్కు ప్రహరీ గోడ చుట్టూ వాకింగ్ చేయడంతో గాంధీ పార్కు కళకళలాడుతోంది.

**చకచకా శాంతి పార్కు పనులు**

శారదానది ఒడ్డున గల శాంతి పార్కు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. జీవీఎంసీ నిధులు రూ.49 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షలతో ఈ పార్కును చూడచక్కగా ఆధునికీకరిస్తున్నారు.



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు


మహాత్మా గాంధీ ఉద్యానవన ప్రవేశ ద్వారం

ఇటీవల నూతనంగా బోరు తీశారు. స్థానికులు, సందర్శకుల కోసం పార్కులో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కులను అభివృద్ధి చేస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శాంతి పార్కులో నూతనంగా తీసిన బోరు

### పార్కులో పుస్తకాలతో కాలక్షేపం



పదవీ విరమణ చెందడంతో ఇంట్లో ఖాళీగా కూర్చోలేకపోతున్నా. గాంధీ పార్కుకు వస్తుంటాను. చిన్నారులు ఆటలాడుకుంటూ సరదాగా కనిపిస్తున్నారు. పార్కుకు వచ్చినప్పుడు ఏదైన పుస్తకం గానీ, దినపత్రిక గానీ వెంట తీసుకొస్తున్నా. పార్కులో కూర్చొని చీకటి పడేవరకు గడుపుతున్నా.

– నల్లల దేముళ్లు, వేల్పులవీధి, అనకాపల్లి

### గాంధీ పార్కును అందంగా తీర్చిదిద్దారు



గతంలో గాంధీ పార్కు అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం దీని రూపురేఖలను జీవీఎంసీ అధికారులు మార్చారు. నిత్యం నా కుమార్తె పిల్లలు, కుమారుడి పిల్లలతో ఈ పార్కుకు వస్తాను. వారితో సరదాగా గడుపుతున్నా. ఖాళీగా ఉన్న సమయంలో పిల్లలతో పార్కుకు వచ్చి వెళ్తుంటాను.

– కె.అర్జున, శ్రీరాంనగర్, అనకాపల్లి

# ఆరోగ్యశ్రీ పథకం చరిత్రాత్మకం

- ప్రజారోగ్యానికి సీఎం జగన్ భరోసా
- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ నూతన కార్డును అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**కశింకోట:** డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం చరిత్రాత్మకమైనదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో సచివాలయం-1కు సంబంధించి 1,103 మంది లబ్ధిదారులకు మంజూరైన నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలందించడం వల్ల పేదలకు ఎంతో మేలు కలిగిందన్నారు. ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీని కొనసాగిస్తూ.. ప్రజారోగ్యానికి భరోసా ఇస్తూ పేదలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు.

**సద్వినియోగం చేసుకోండి..**

ఆరోగ్యశ్రీ పథకం కింద ఇప్పటి వరకు రూ.5 లక్షల పరిమితి వరకు వెయ్యి రకాలకు పైగా వ్యాధులకు ఉచిత వైద్య సేవలందించే వారని మంత్రి అమర్‌నాథ్ పేర్కొన్నారు. కోవిడ్ సమయంలోనూ సేవలందించారన్నారు. తాజాగా దీని పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. 3,500 వ్యాధులకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందించనున్నారన్నారు. అధిక వ్యయం అయ్యే క్యాన్సర్, లివర్, గుండె, కిడ్నీ మార్పిడి వంటి సర్జరీలకు ఈ పథకం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. దీనిలో అయ్యే పూర్తి వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రోగులకు చికిత్స అనంతరం ఉచిత రవాణాతో ఇంటికి చేరుస్తుందని, రోగి పరిస్థితిని అనుసరించి ఆర్థిక సాయాన్ని అందజేస్తుందన్నారు. ప్రజలంతా ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ సంస్థ అధ్యక్షుడు దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయ రజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజీమెన్, పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చెవ్వేటి చంద్రమ్మ, ఎంపీడీవో వి.వి.రవికుమార్, కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి కె.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి అమర్‌నాథ్‌కు వినతి

**అనకాపల్లి :** తమ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఈ మేరకు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్, నేతలు పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

## సీఎం జగన్‌తోనే సంక్షేమం


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

**అనకాపల్లి :** గత ప్రభుత్వంలో ప్రజలు సమస్యలు చెప్పుకోవాలంటే టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారని, నేటి పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల సీఎంలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు అక్కడ అమలు చేస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు బ్రోచర్లు అందజేసి, గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కరణం సత్తిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ నారిపిన్ని ప్రసాద్, పార్టీ నేతలు గొర్లి తాతారావు, రమణ అప్పారావు, బొండా అప్పలరాజు, రాజశేఖర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన రత్నాకర్

**కశింకోట :** మండలంలోని నరసింగబిల్లి, చింతలపాలెం ప్రభుత్వ పాఠశాలలను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం సందర్శించారు. నరసింగబిల్లి హైస్కూల్లో అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక అమలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడులో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలో మరమ్మతులు నిర్వహించడానికి తాను సొంతంగా రూ.50 వేలు సమకూర్చనున్నట్లు తెలిపారు. నరసింగబిల్లి కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని సీఐ రవికుమార్‌ను ఫోన్‌లో కోరారు. అందుకు చర్యలు తీసుకుంటామని సీఐ బదులిచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి ప్రసాదరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, గొబ్బూరు నాయకుడు మళ్ల గోపి, చింతలపాలెం సర్పంచ్ కొట్టె రాము, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


హైస్కూల్‌ను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్


## విద్యుత్ పొదుపుతో భావితరాలకు మేలు

**కశింకోట:** విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సత్యనారాయణ కోరారు. కశింకోటలోని వివేకానంద స్కూల్‌లో డివిజన్ ఏఈ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తూ బుర్రకథ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపునకు ఎల్‌ఈడీ బల్బులను వినియోగించాలని సూచించారు. ఇండక్షన్ ఉపయోగించినప్పుడు అన్నం ఉడికిన తర్వాత స్విచ్ ఆఫ్ చేసుకోవాలన్నారు. లేదంటే కొంత విద్యుత్ వృథా అవుతుందని చెప్పారు. విద్యుత్‌ను పొదుపు చేసి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడటానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులు తమ తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారికి తెలియజేసి అవగాహన కలిగించాలని ఉద్బోధించారు. కశింకోట డివిజన్ డీపీఈ కనకారావు, స్కూల్ కరస్పాండెంట్ మళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ పొదుపుపై బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

## న్యాయవాదుల దీక్ష

**అనకాపల్లి:** ల్యాండ్ టైటిలింగ్ చట్టాలను రద్దు చేయాలంటూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయస్థానం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం భూహక్కు చట్టాన్ని కోర్టు పరిధి నుంచి రెవెన్యూ పరిధిలోకి తీసుకోవడం వల్ల బడుగు, బలహీన వర్గాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. భూ యాజమాన్య హక్కు చట్టం 27/2023 ప్రభుత్వ తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూర శ్రీనివాస్, న్యాయవాదులు హర శ్రీనివాస్, కుమార్, బంధం రమణ, రాంప్రసాద్, గోవిందరాజు, జోగారావు, రాజశేఖర్, లీలా, కుసుమ పాల్గొన్నారు.


కోర్టు వద్ద దీక్ష చేస్తున్న న్యాయవాదులు

## సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

**అనకాపల్లి :** గ్రేటర్ విశాఖ విలీనగ్రామమైన కొప్పాక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట బుధవారం సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు దిగుమతామని ఉద్యోగ సంఘాల జేఏసీ పట్టణ అధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**వేతనాల పెంపు కోరుతూ వినతి..**

**కశింకోట:** కశింకోటలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం భిక్షాటనతో నిరసన తెలిపారు. తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. ఐద్వా అధ్యక్షురాలు బి.ప్రభావతి, కోశాధికారి పుణ్యవతి తదితరులు అంగన్‌వాడీల నిరసనకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగేషు, సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా**

**తుమ్మపాల:** విద్యా రంగ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) బి.దయానిధికి అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జీ.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కామాటి వంటి పోస్టులు భర్తీ చేయాలని, అద్దె భవనాల స్థానంలో సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనకాపల్లి కేంద్రంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు, జిల్లా నాయకులు జగదీష్, రవి, ప్రకాష్, చరణ్, కౌశిక్, వి.జశ్వంత్, పాల్గొన్నారు.